నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- అందుబాటులోకి తేవాలంటున్న గ్రామస్తులు


ఇల్లంతకుంట పంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్

ఇల్లంతకుంట: సామాన్య ప్రజలకు మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ రెండేళ్లుగా నిరుపయోగంగా ఉండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. మండల కేంద్రంలో 2008లో ఏసీడీపీ, గ్రామ పంచాయతీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. 2011 నుంచి వాటర్ ప్లాంట్ ద్వారా ఇల్లంతకుంట గ్రామ ప్రజలకు మినరల్ వాటర్ అందుబాటులోకి తెచ్చారు. ప్రారంభంలో కొంతకాలం ఉచితంగా పంపిణీ చేసినా.. నిర్వహణ ఖర్చుల నిమిత్తం గ్రామ పంచాయతీ కొంత మొత్తం నిర్ణయించి ప్రైవేటు వ్యక్తులకు మొదట్లో కేటాయించింది. అనంతరం టెండర్ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ అధిక మొత్తం పాడిన వ్యక్తులకు కేటాయిస్తూ వస్తున్నారు. 2 సంవత్సరంల నుంచి మినరల్ వాటర్ ప్లాంట్ టెండర్ నిర్వహించక మూసేశారు. మిషన్ భగీరథ ద్వారా ఇళ్లలోకి వచ్చే కుళాయి నీళ్లు అప్పుడప్పుడు రంగు మారుతుండడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం మినరల్ వాటర్‌పైనే ఆధారపడుతున్నారు. ఇల్లంతకుంటలో 5 వరకు ప్రైవేటు వాటర్ ప్లాంట్లున్నాయి. 20 లీటర్ల క్యాన్‌కు రూ.10 చొప్పున వసూలు చేస్తారు. పంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్ అందుబాటులో ఉంటే రూ.5కే 20 లీటర్ల క్యాన్‌కు చార్జి చేసేవారని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీ వాటర్ ప్లాంట్ ఉపయోగంలోకి తేవాలని ఇల్లంతకుంట గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



కొంతకాలంగా వాటర్ ప్లాంట్ ఉపయోగంలో లేదు. ప్లాంట్ విడి భాగాలు కొన్ని మరమ్మతు చేయాల్సి ఉంది. జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.
– చంద్రశేఖర్, జీపీ కార్యదర్శి

మిషన్ భగీరథ నీళ్లు తాగలేం



మిషన్ భగీరథ నీరు కొన్నిసార్లు రంగుగా వస్తుంటాయి. వీటిని తాగడానికి ఉపయోగించం. రోజు రూ.10 చెల్లించి 20 లీటర్ల క్యాన్ ప్రయివేటు వాటర్ ప్లాంట్ వద్ద నుంచి తెచ్చుకుంటాం.
– బండారి కనకయ్య, ఇల్లంతకుంట

లాభం వచ్చింది



2011లో రూ.95వేలకు వాటర్ ప్లాంట్ టెండర్ పట్టిన. రూ.2కే 20 లీటర్ల నీరు అమ్మిన. కరెంట్ బిల్లు రూ.3వేల వరకు వచ్చేది. లాభదాయకంగా ఉండె. ప్లాంట్ టెండర్ వేస్తే మళ్లీ పట్టుకుంటా.
– ముంజ రామస్వామి, ఇల్లంతకుంట

క్లుప్తంగా

ఎరుమేలికి అయ్యప్ప స్వాములు

ఇల్లంతకుంట: మండల కేంద్రానికి చెందిన అంతటి రామచంద్రం అయ్యప్ప మహా పాదయాత్రకు బయలుదేరి శుక్రవారం ఎరుమేలికి చేరుకున్నారు. ముస్తాబాద్ రాజు గురుస్వామి 40 మంది అయ్యప్ప స్వాముల బృందంతో ఆగస్టు 20న మహా పాదయాత్రకు బయలుదేరి వెళ్లారు. 51 రోజుల కాలినడకతో 1,300 కిలోమీటర్లు మహా పాదయాత్ర చేసి ఎరుమేలి చేరుకున్నారు. ఈనెల 17న అయ్యప్ప గుడి తెరచుకోగానే దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణమవుతానని తెలిపారు.

బీసీ నాయకుల నిరసన

రుద్రంగి: హైకోర్టు ఎన్నికల నిర్వహణకు స్టే విధించడంపై బీసీ మండల నాయకులు మండల కేంద్రంలో నిరసన తెలిపారు. చెలుకల తిరుపతి, గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పూదరి మహిపాల్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవోలతో మోసం


ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎన్నికలు వాయిదా పడడంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తలాతోక లేని ప్రభుత్వంగా మరోసారి నిరూపితమైందని, జీవో ద్వారా బీసీ రిజర్వేషన్లు ఇస్తే చట్టబద్ధత ఉండదని తెలిసి కూడా జీవో తెచ్చి బీసీలను మోసం చేశారని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అందే సుభాష్, మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు పందిర్ల పర్శరాములుగౌడ్, కొండ రమేశ్‌గౌడ్, నారాయణ, సురేశ్, బాల్‌రాజ్ నర్సాగౌడ్, రామభీమేశ్వర్, దేవరాజు, మురళిగౌడ్, ఎడ్ల సందీప్, మీసం రాజం, బాలయ్య, జబ్బర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసి అధికారంలోకి..

తంగళ్లపల్లి: కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసపుచ్చి అధికారంలోకి వచ్చారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు మాట్ల మధు, పడిగెల మానస, బండి దేవదాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

తంగళ్లపల్లి: బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మనుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగెల రాజు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరాటం

ముస్తాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరాటం చేస్తామని బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాళ్ల సురేశ్ అన్నారు. ముస్తాబాద్‌లో విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ.. హైకోర్టులో బీసీల 42 శాతం రిజర్వేషన్లపై స్టే విధించడం దురదృష్టకరమన్నారు. ఈనెల 14న ఆర్.కృష్ణయ్య ఇచ్చిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ఎల్‌వోసీ మంజూరు

కోనరావుపేట: మండల కేంద్రానికి చెందిన దూర్ల మౌనిక అనారోగ్యంతో బాధ పడుతుండగా.. విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి రూ.1.25లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు.

తల్లిదండ్రుల సహకారంతో అల్పాహారం

గంభీరావుపేట: దమ్మన్నపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

కోనరావుపేట: వెంకట్రావుపేటలో 15 రోజులుగా కేఎంసీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు ముగిశాయి. ఆరెంజ్ వారియర్స్ టీం విజేతగా నిలిచింది. నిర్వాహకులు బహుమతులు అందించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: నిరక్షరాస్యులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నతంగా రాణించాలని ది రాజేశ్ ఫౌండేషన్, విశ్వ ప్రగామి ట్రస్ట్ ప్రతినిధి రాజచంద్ర అన్నారు. మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 18 అక్షరాస్యత కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు.

రాజన్న లడ్డూల వివాదం


లడ్డూలు బూజు పట్టి దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆలయ అధికారికి చూపిస్తున్న నాయకులు

వేములవాడ: వేములవాడ రాజన్న భక్తులు అత్యంత ప్రీతిపాత్రంగా కొనుగోలు చేసే లడ్డూలపై ఆలయ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, దీంతో లడ్డూల్లో బూజు పట్టి దుర్వాసన వస్తున్నాయని, ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకొని భక్తుల మనోభావాలు కాపాడాలని బీజేపీ నాయకులు రాపెల్లి శ్రీధర్, సంతోష్, హన్మండ్లు కోరారు. శుక్రవారం కౌంటర్లను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టణానికి చెందిన సంజీవ్ అనే యువకుడు లడ్డూల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని పేర్కొంటూ ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

మంత్రి ఆరా

వేములవాడ రాజన్న లడ్డూలు బూజు పట్టి దుర్వాసన వెదజల్లుతున్నట్లు వచ్చిన ఘటనపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ శుక్రవారం ఆరా తీశారు. ఘటనకు సంబంధించిన సమగ్ర విషయాలు అందజేయాలని ఆలయ ఈవో రమాదేవిని ఆదేశించారు. లడ్డూపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదని ఈవో మంత్రికి చెప్పారు.

మానసిక ఒత్తిడి వద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కోనరావుపేట: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యం గురించి, పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా అధిగమించడం, ఎక్కువగా ఆలోచించడం, నిద్ర పోకపోవడం, మానసిక సమస్యల గురించి అవగాహన కల్పించారు. కోనరావుపేట వైద్యాధికారి వేణుమాధవ్, ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎం సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ఆదర్శవంతమైన ఆన్‌లైన్ జీవితాలతో నిరంతరం పోల్చడం, సైబర్ బెదిరింపు, నిద్ర అంతరాయంతో పెరిగిన ఆందోళన, నిరాశ, ఒంటరితనం, తక్కువ ఆత్మగౌరవానికి దోహదం చేయడం ద్వారా సోషల్ మీడియా విద్యార్థులకు మానసిక ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందన్నారు. కళాశాల భాగ్య హెల్త్ క్లబ్ వారు కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కరుణకుమారి, శివాని తదితరులున్నారు.

తంగళ్లపల్లి: మండెపల్లి వృద్ధాశ్రమంలో మానసిక ఆరోగ్యం బాగా లేని వృద్ధులకు మానసిక వైద్యుడు ప్రవీణ్‌కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు.

సీజేఐపై దాడికి నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ జాతీయ మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. దోసల చంద్రం, లక్కం బాబు, పిట్ల రఘు, బాలయ్య, సుదర్శన్, రాజు, శంకర్, వెంకటేశ్, శ్యాంసుందర్, చక్రధర్, సంకీర్తన్, సతీశ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్: జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి రొడ్డ రామచంద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాలుక సత్యం, నీరటి శ్రీనివాస్, గూడె బాబు, ఎడ్ల రాజుకుమార్, శేఖర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అరెస్టు

చందుర్తి: వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని ఓ యువతిని బెదిరించిన ఓ యువకున్ని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు, ఎస్సై జిల్లెల రమేశ్ తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఫొటోలను అనంతపల్లి గ్రామానికి చెందిన సలేంద్ర వేణు అనే యువకుడు గ్రామానికి చెందిన పోలే ప్రశాంత్ వద్ద నుంచి తీసుకున్నాడు. సలేంద్ర వేణు సదరు యువతి పేరిట ఫేక్ ఐడీ క్రియేట్ చేసి యువతికి మేసేజ్‌ల ద్వారా రూ.5లక్షలివ్వాలని, లేకుంటే నీకు సంబంధించిన వ్యక్తిగత ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో యువతి షీ టీమ్, చందుర్తి పోలీసులను ఆశ్రయించింది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేణును మధ్యాహ్నం పట్టుకున్నారు.

బైక్, ఆటో ఢీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో పలువురు గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. సిద్దిపేట వైపు నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ఆటో ముందు వెళ్తున్న బైకును ఢీకొట్టడంతో ఆటో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. బైక్ నడుపుతున్న వ్యక్తికి, ఆటోలో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదకరంగా బావి



కోనరావుపేట: కనగర్తిలో ఓ పాడుబడిన బావి ప్రమాదకరంగా మారింది. వర్షాలకు నిండడంతో ఆ బావిలోని నీరు నీటి కుండీల్లోకి చేరుతోంది. దీంతో కాలనీవాసులు మురుగునీటితో ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని రెండో వార్డులో నివాసాలకు పక్కన ఓ పాడుబడిన బావి ఉంది. చెత్తాచెదారం ఇందులోనే వేస్తుండడంతో కొన్ని రోజులుగా దుర్వాసన వస్తోంది. ఇటీవల కురిసన వర్షాలకు బావి నిండింది. బావిలోని నీరు ఇళ్లల్లో ఉన్న నీటి కుండీల్లోకి చేరుతోంది. దీంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలోని బావిని పూడ్చివేయాలని వారు కోరుతున్నారు.

మద్దతు ధర చెల్లించాలి

బోయినపల్లి: కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతు ధర చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ కోరారు. బోయినపల్లిలో శుక్రవారం మాట్లాడుతూ.. క్వింటాల్ మద్దతు ధర రూ.10వేలు నిర్ణయించాలన్నారు. రైతులు నర్సయ్య, ఆంజనేయులు, లచ్చయ్య, బొడిగె అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల కేటాయింపు

ఇల్లంతకుంట: మండలంలోని 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా గ్రామైక్య సంఘాలకు కేటాయించారని ఐకేపీ ఏపీఎం లతామంగేశ్వరి తెలిపారు. పెద్దలింగాపురం, వల్లంపట్ల, తిప్పాపురం, వెంకటాపురం, వెల్జిపురం గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు శుక్రవారం డంప్ చేశారన్నారు. ఇల్లంతకుంట, పొత్తూరు, దాచారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇల్లంతకుంట ప్యాక్స్‌కు కేటాయించారని పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్ రోడ్ల తిరుపతిరెడ్డి తెలిపారు. గాలిపెల్లి, తాళ్లపల్లి, వంతడుపుల ధాన్యం కొనుగోలు కేంద్రాలు గాలిపెల్లి ప్యాక్స్‌కు కేటాయించారని, గన్నీ సంచులు డంపు చేశారని పర్సన్ ఇన్చార్జి చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి తెలిపారు.

కలెక్టర్‌కు వినతి

వీర్నపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు ఇవ్వాలని కంచర్ల గ్రామ మమత మహిళా సంఘ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ ఎం.హరితకు వినతిపత్రం అందజేశారు.

కొనుగోళ్ల పేరుతో కోతలు

ముస్తాబాద్: మండలంలోని ఓ రైస్‌మిల్లులో ధాన్యం కొనుగోళ్ల పేరుతో కోతలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రచారం చేశారని, తీరా మిల్లులో ధాన్యం విక్రయించిన తరువాత కోతలు పెడుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ రామచంద్రం మాట్లాడుతూ.. సదరు రైస్‌మిల్లులో విచారణ చేశామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు.

నాణ్యత లేని సన్న బియ్యం సరఫరా

ఇల్లంతకుంట: పెద్దలింగాపురం గ్రామ చౌక ధరల దుకాణానికి నాణ్యత లేని సన్న బియ్యం సరఫరా చేశారని గ్రామస్తులు గుర్రాల అనిల్, గన్నేరు మల్లయ్య, దండవేని రజనీకాంత్, దర్శనం లక్ష్మణ్ శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. ఆనంద్ స్పందిస్తూ డీజీఆర్‌వో ద్వారా విచారణ జరిపించి చెడిపోయిన బియ్యం తిరిగి తీసుకొని నాణ్యమైన బియ్యం గ్రామ డీలర్లకు సరఫరా చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ముస్తాబాద్: రామలక్ష్మణపల్లెలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఫిజిషియన్ డాక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పాఠశాల తనిఖీ

చందుర్తి: సనుగుల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి వినయ్ తనిఖీ చేశారు. ఆరోతరగతిలో గణితం బోధన చేస్తున్న తరగతిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ అడిగి తెలుసుకున్నారు.

మాజీ ఎంపీపీ నిజాయితీ

చందుర్తి: గుర్తుతెలియని వ్యక్తి అకౌంట్ నుంచి తన ఫోన్‌పేకు వచ్చిన డబ్బులను శుక్రవారం పోలీసులకు అప్పగించి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య తన నిజాయితీని చాటుకున్నారు. వివరాలు.. గత నెల సెప్టెంబర్ 14న పెంటయ్య ఫోన్‌పేకు రూ.49,850 వచ్చాయి. డబ్బులు పంపిన వ్యక్తి ఇదే నంబర్‌కు తిరిగి ఫోన్‌పే చేయాలని కోరారు. నీ డబ్బులు నీకు కావాలంటే ఆధారాలు తీసుకొచ్చి తీసుకెళ్లాలని ఫోన్‌లో కోరారు. 20 రోజులుగా ఆ వ్యక్తి రాకపోవడంతో పెంటయ్య పోలీసులను ఆశ్రయించారు.

పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ: ఈనెల 14, 15ల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. గుర్రం అశోక్, సరిపల్లి నరేశ్, దుబ్బ లచ్చయ్య, వావిలాల లక్ష్మి, గుడిసె మల్లేశం, సావనపల్లి శీను, కుమ్మరి రాము, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



చందుర్తి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న సీసీ రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు రాకపోకలకు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదం జరగకముందే సెస్ అధికారులు స్పందించి సీసీ రోడ్డుపై ఉన్న స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మహేశ్, సెస్ ఏఈ చందుర్తి, సెల్ నెం: 9440814077

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ రాణి

ముస్తాబాద్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. పోతుగల్, కొండాపూర్, గూడూరు గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్ముల రామ్‌రెడ్డి, డైరెక్టర్ బద్దిపడిగె ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో లచ్చాలు, ఏపీఎం కల్యాణి, ఆర్ఐ రఘు, నాయకులు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీను, నర్సింలు, మామిండ్ల ఆంజనేయులు, అనమేని రాజు, సీసీలు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులు పాటించాలి


పొత్తూరులో రైతు సదస్సు

ఇల్లంతకుంట: రైతులు వ్యవసాయంలో వస్తున్న అధునాతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.మదన్మోహన్‌రెడ్డి అన్నారు. పొత్తూరు రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో పాల్గొని మాట్లాడారు. డాక్టర్ హరికృష్ణ యాసంగిలో ఆరుతడి పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై వివరించారు. శాస్త్రవేత్తలు బి.రాంప్రసాద్, వి.నరసింహారెడ్డి, ఉమారాణి, రాజేంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి సురేశ్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


సిరిసిల్లలో పోషణ మాసం కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, గర్భిణులు

సిరిసిల్లటౌన్: పౌష్టికాహారంతో గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని సీడీపీవో ఉమారాణి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘంలో పోషణ మాసం కార్యక్రమం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సూపర్‌వైజర్ దివ్య, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత, కవిత, మమత, దేవిక, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: చిన్న పిల్లల్లో లోప పోషణ లేకుండా చూసుకోవాలని సీడీపీవో సౌందర్యరాణి అన్నారు. శుక్రవారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చెక్కపల్లి గ్రామంలో మండలస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన జరిపారు.

కార్యవర్గం ఎన్నిక

గంభీరావుపేట: గంభీరావుపేట శ్రీరామ ట్రాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా గంట శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా మారవేని మహేశ్, కోశాధికారిగా చల్లపురం గణేశ్, సలహాదారులుగా గంధ్యాడపు లింగం, రాజు, మల్లయ్య, స్వామి, రమేశ్, కోటయ్య, సంతోష్‌రెడ్డి ఎన్నికయ్యారు.

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పట్టణ శాఖకు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా టి.లక్ష్మణ్‌రావు, జె.మోహన్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా బాలసాని బాలమల్లయ్య, ఉపాధ్యక్షులుగా చంద్రలీల, ఎస్.ఎల్లయ్య, నిర్వాహక కార్యదర్శులుగా వి.ఎల్లయ్య, పి.యాదగిరి,, సంయుక్త కార్యదర్శిగా ఎస్.విద్యాసాగర్, ప్రచార కార్యదర్శిగా ఎం.దశరథం, ఆర్థిక కార్యదర్శిగా పి.దేవయ్య, సభ్యులుగా ఎండీ హనీఫ్, మల్లారెడ్డి, వి.వెంకటేశం ఎన్నికయ్యారు.

కనీస వేతనం చెల్లించాలి

వేములవాడ: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం కమిషనర్ అన్వేష్‌కు వినతిపత్రం సమర్పించారు.



ప్రయాణం.. ప్రమాదకరం

రుద్రంగి: మండల కేంద్రంలోని ఒకటో వార్డు రామకిష్టాపూర్ కాలనీ ఎల్లంపెల్లి కాలువపై నిర్మించిన కల్వర్టు వద్ద ప్రమాదకరంగా మారింది. కల్వర్టు పరిసరాల్లోని దారిపై ఎక్కువ ఎత్తులో మట్టిపోయడం, వర్షం పడినపుడు కల్వర్టుపై నీరు నిలుస్తోంది. కల్వర్టు నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన సిమెంటు కట్టలను తొలగించకపోవడంతో ప్రజలు నడిచేందుకు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు పరిసరాల్లో మరమ్మతు చేసి సిమెంటు కట్టలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.